# ఖైదీనే....?

మధుమూర్తి

"కొంచెం గురితప్పింది, లేకపోతేనా నువ్వు నా ఖైదీవి కావాల్సిందే!" అంది విరగబడి నవ్వుతూ సరళ.

అపజయాన్ని అర్థంచేసుకోకుండా సరళ నవ్వుతుంది యెందుకో నాకు అర్థంకాలేదు.

ఐనా నేను ఆమెకు ఖైదీ కావలసిన అపచారం యేమిచేసాను? అదీగాక గురితప్పితే సరళకు ఖైదీనెలా ఔతాను. మృత్యుసోదరికేగాని?

ఏమిటో ఆమెనవ్వు నన్ను మాత్రం ఏడ్పించింది కాస్సేపు. ఇంతవయస్సు నెత్తిమీదకువచ్చినా కూడా ఆచిన్నమ్మాయి మాటలను అర్థంచేసుకోలేకపోయినందుకు విచారమే కలుగుతుంది కాని నవ్వెక్కడ దాపరిస్తుంది?

ఆనవ్వు ప్రతిధ్వనుల్లోనో లేకపోతే నా మైమరపులోనో కాని విశ్వంపిలిచిన పిలుపు మాయమైంది. దగ్గరగావచ్చాక కాని విశ్వం నాదృష్టిలో పడలేదు. అతను కనిపించడంకూడా నవ్వుల్తోనే!

వీళ్ళిద్దరూ తోడిదొంగల్లా కనిపించేరు నాకు. అంతేకాదు. హంతకుల్లా కనిపించారు.

"పోదామా!" అన్నాడు విశ్వం.

"మరి నేను ఖైదీనికానా" అన్నాను. సరళ నవ్వింది కాని విశ్వం ఆశ్చర్యపడ్డాడు.

"ఏమిటి ఇలా మాట్లాడతాడు సరళా?" అని ప్రశ్నించాడు విశ్వం.

"ఏమీలేదు. ఆయన మహాకవి: ఏదో భావోద్రేకంలో ఉన్నట్టున్నారు. కాస్తముట్టుకో...ఊహలోంచి యదార్థంలోకి దిగుతారు" అంది సరళ.

సరే. ఈసంగతి విశ్వానికి చెప్పకూడదు కాబోలని తెలుసుకున్నా.

నన్ను ముట్టుకుని కదిలించాడు విశ్వం. నేనూ ఏదో తపస్సులోంచి దిగిన మునిలాగ ఒక్కసారి గట్టిగా "ఆఁ" అన్నాను.

"ఏమిటీ దీర్ఘ యోచన?"

"ఏమీలేదు, రేపు క్రొత్తగా స్వాతంత్ర్యం వచ్చినా కవిమాత్రం స్వతంత్రుడు కాడని, కవి పిచ్చివాడనీ ఖైదే అతనికి నివాసస్థలమనీ ఎవరో చెవిలో ఊదుతున్నారు ఇందాకట్నుంచి" అన్నా.

"కర్ణపిశాచి కాదుకదా?" అంది సరళ.

విశ్వం చాలాకోపంగా సరళకేసి చూచాడు. అతనిచూపు నన్ను సంతృప్తిపరచింది.

"లే...పోదాం" అన్నాడు విశ్వం. ఇంటి బైటకువచ్చాం. సరళ "వెడుతున్నారా?" అన్న ప్రశ్నకు జవాబివ్వలేదు.

"ఏం యీవేళ సరళ యింత హుషారుగా ఉంది?" అన్నాడు విశ్వం,

"నాకేం తెలుసునోయ్! ఇంట్లో అన్నగారివై ఉన్న నీకే తెలియదు." అన్నా.

"అన్నయితే మాత్రం ఆమెగుండెల్లో దూరి తెలుసుకోగలనా?"

"అయితే నువ్వు కవివి కాదు."

"నేను కవినని అనుకోడంలేదే!"

"ఇంత చదువూ చదివినా నీకుకాస్తంత కవితాహృదయమేనా అలవడకుండా ఉందా అని అనుకుంటున్నాను."

"పొరబడుతున్నావ్!"

"ఇకనుంచి దిద్దుకుంటా. మరి సరళ ఆనందానికి కారణం ఈవేళ ఆమెపుట్టినరోజా ఏమిటి?"

"ఇది ఏమాసం"

"మే"

"ఐతే కాదు. ఆమె పరీక్షాఫలితాలు తెలిసి ఉండవచ్చు."

"ఐతే కావొచ్చు."

ఇలా - సంభాషణలు సాగించే సరికి మేమి ద్దరం అరఘర్లాంగు దూరంలో ఉన్న పార్కుకి చేరాం. రేడియో విశ్రాన్ని మనే అనుకోవాలి. ఎందు కంటే ఒక్క చక్కని ముక్కయినా నా చెవిలో నివాసం ఏర్పరచుకోలేదు ఆవేళ. కారణం కార్య క్రమాలలో పసందులేక కాదు...నాదృష్టి ఖైదీ మీద పడడంవల్ల...

మర్నాడు ఉదయమే యధాప్రకారం విశ్వం ఇంటికి వెళ్లాను. కాని రాత్రి తెల్లవార్లూ ఆమె అన్నమాటలకి అర్థం తెలుసుకోలేక పోయాను. ఎన్నివిధాల బుద్ధికి వ్యాయామం కలిగించినా ఫలించ లేదు. సందర్శకులకు నియమింపబడ్డ కుర్చీల్లో కూచోగానే సరళ ఎదురైంది. నవ్వుమాత్రం ఆమె ముఖంలోంచి అంతర్ధానం కాలేదు.

నేను పలకరించలేను. నాభావాలను గ్రహించి ఆమె కూడా మాట్లాడ లేదు. కాని ఆమెకు పలక రించాలని ఉన్నట్లు నాకు రెండు నిమిషాలు గడి చిన తర్వాత ఆమె వేసిన ప్రశ్నవల్ల అర్థమైంది.

“ఎవరికోసం వచ్చారండీ తమరు? పేరు కూడా అడగవచ్చునా?” అన్నదే ఆమె ప్రశ్న.

ఫక్కున నవ్వాను. నానవ్వుతో శ్రుతికలి పింది సరళ. “నీ మాటలు మాత్రం సరళం కావు కదా!” అన్నా.

“ఏమిటి కర్ణపిశాచి చెప్పిందా?”

“కాదు...” ఆ కొంటె ప్రశ్నలకు కోపం ఎవరికి మాత్రం ఎలావస్తుంది?

“ఔను గాని - మీ రీవేళ ఖైదీగా చిక్క కుండా వెళ్ళగలరా ఇక్కణ్ణుంచి?” అంది సరళ.

నాకేమీ అర్థంకాలేదీ ప్రశ్న. నన్ను సరళ ప్రేమిస్తుందా? ఆ ప్రణయ సామ్రాజ్యంలో నన్ను ఖైదీగా బంధించుకో దలచుకుందా? ఈ ప్రశ్నలు నాలో కలిగాయి.

నిజమే ఆమె నన్ను ప్రేమిస్తోంది. వచ్చినప్పు డల్లా ఆమె నన్నుచూసే విధానంలో ఆభావం కలుగుతోంది. అదీ గాక ఆకుటుంబంతో నాకు పరి చయమైన తరువాత వాతో కొన్నివారాలకు కాని విశ్వం చనువుగా మాట్లాడలేదు. సరళ మాత్రం రెండు రోజులకే చనువు తీసుకోవడం ప్రారంభిం చింది.

చనువుగా మాట్లాడే ప్రతీ స్త్రీని ప్రేయసిగా ఎన్నుకోవడం ఏమిటనే సందేహం మళ్ళీ కలిగింది. ఇంత సంకుచిత భావం నాలో తలఎత్తినందుకు నన్ను నేనే నిందించుకున్నాను.

సరళ చలాకీతనాన్ని అపార్థం చేసుకోలేను. కాని ఆమె మాటల్లో దాగిన అర్థాన్ని గ్రహించు కోవడం ఎలాగ? ఆమె ఎదురుగా ఉండగా ఆ గూఢార్థం నాకు తట్టదేమో అనుకుని రాత్రి తెల్ల వార్లూ పనిపట్టుకుని మాటిమాటికీ ధ్యానాన్ని ఇతర పంథాలనుంచి వెనక్కులాగుతూ కసరత్తు చేసాను. కాని ప్రయోజనం లేకపోయింది.

స్పష్టంగా అడిగితేనో సరళని..?

నన్ను అపార్థం చేసుకుంటుందేమో?

ఐనా అడిగా...“నన్ను ప్రేమిస్తున్నావా సరళా..? అని.. ఆమె అలాగే నిలబడింది. మాట్లా డదేం? కదలిక లేదేం ఆమెలో...?


మహాభల్లాతకి లేహ్యము

సర్వవిధములగు కుష్ఠములను సమూలముగా నాశనమొనరించు దివ్యౌషధము. కొరకములు పొడలు మొదలగువానిని 10 మోతాదులతో తగ్గించును. అనుపానంతో 40 దినములకు రూ. 12-0-0. వలయువారు:

డాక్టర్ డి. నరసింహాచార్యులు
ఈగావారిపాళెం,
మాదరపాకం పోస్టు, చంగల్పట్టు జిల్లా.

ఇలా ఐదు నిమిషాలు గడిచాయి.

"నా ప్రశ్నలు వినబడలేదూ?"

"లేదు.. నా ప్రశ్న వినిపించిందా?" అన్నా.

"లేదు."

నాకు ఉద్రేకం మాత్రం హెచ్చిపోయింది. గాని నా నోటమ్మట మాటమాత్రం ఊడిపడలేదు. "పోనీలే.. ప్రేమిస్తున్నావా అన్నమాట బైటపడకుండా ఉండడమే మంచిది" అనుకున్నాను.

సరళ నన్ను చూసి నవ్వుతోంది— నేను పరధ్యాన్నంలో ఇంతసేపు మునిగి పోయినందుకు ఆమెకు కారణం తెలియక..

"ఏం.. పలకరేం?"

"పలుకుతా.. ఖైదీ అంటే అర్థం ఏమిటి?" అన్నా.

నా ప్రశ్నకు చాలా జాలిపడింది. సానుభూతి చిహ్నంగా ఒక్క చిరునవ్వు నవ్వి "కూచోండి-ఒక్క పదినిమిషాల్లో చెబుతా" అంటూ వెళ్లిపోయింది.

పదినిమిషాలు ఎలాగో గడిచాయి. విశ్వం సరళ జడను పట్టుకుని నవ్వుతూ నా దగ్గరగా లాక్కొని వచ్చాడు.

"ఖైదీ అంటే అర్థం ఏమిటో తెలిసిందా?" అంది సరళ.

దిక్కులు చూసాను.

"చూడవోయ్ వెనకాల" అన్నాడు విశ్వం

ఏముందీ? కెమేరా...

"ఈ వేళ గురి తప్పిందా?" అన్నాను.

"ఎందుకు తప్పుతుందీ?" అంది సరళ

"ఫోటో పోటీలకు పంపదగ్గ పోజ్ నీలో ఉందట.. ఒక స్నేప్‌లాగి పత్రికకు పంపుదామని రెండు రోజులు నుంచి ప్రయత్నిస్తూందిట! ఈ వేళ నేను ఒక్క సైకను ముందుగానస్తే సరళకి పాపం పని జరగకపోను. క్లిక్ వినబడ్డాక ఆమె జడపట్టుకున్నా." అన్నాడు విశ్వం.


## వేప్రిన్

దెబ్బలు, కురుపులు, తామర, ఎక్జిమా, గజ్జి, సుఖవ్యాధులవలన కలిగిన పుండ్లు, తేలుకుట్టు, మూలశంఖ, కాల్పులు మొదలైనవాటిని అద్భుతంగా నివారణచేస్తుంది. కొత్తచర్మం త్వరగా వచ్చేటందుకు సహాయపడుతుంది. ప్రతియింటా తప్పనిసరిగా డాక్టరులా వుండితీరాల్సిన ఔషధం.

¼ ఔ. సీసా అణాలు 8. ½ ఔ. సీసా అణాలు 14.

## హాలేరిన

అతిసారానికి. జిగట. రక్త విరోచనాలకి
అద్భుతమైన ఔషధం.

అతిసారం. జిగట, రక్త విరోచనాలు, వాంతులు, జబ్బువల్లవచ్చిన జ్వరం వీటిని తగ్గించును.

అసాధ్యమైన జబ్బులన్నీ ఈమందుకి
సాధ్యమౌతాయి.

6 మాత్రలు గల పేకట్ 4 అణాలు.

## క్యాప్సినాల్

దగ్గు. రొంపల్ని అశ్రద్ధగా చూడకండి.

ఎందుకంటే ఊపిరితిత్తులలో రకరకాలవ్యాధుల్ని తీసుకొస్తుంది. అలా రాకుండా 'క్యాప్సినాల్' సహాయపడుతుంది.

దగ్గులు, రొంపలు, ఇన్‌ఫ్లుయన్‌జా, మొదలైన వ్యాధుల్ని నివారణచేస్తుంది.

6 మాత్రలు గల పేకెట్టు 4 అణాలు.

4 ప్యాకట్లకు తక్కువ వి. పి. లో పంపబడదు.

అన్ని షాపులలోనూ దొరకును.

ది లస్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెని,
చిక్‌పేట, బెంగుళూరు సిటీ.